









కమనీయం దుర్గాష్టమి మహోత్సవం




ఉత్సవమూర్తులకు తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం, తిరువీధుల్లో విహరిస్తున్న ఉత్సవ మూర్తులు

ఆళ్లగడ్డ: ప్రముఖ పుణ్యక్షేత్రం అహోబిలంలో శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం దుర్గాష్టమి పూజలు విశేషంగా నిర్వహించారు. తెల్లవారుజామున మూలమూర్తులను సుప్రభాతసేవతో మేలుకొలిపి దివ్యదర్శనం అనంతరం నిత్యపూజలతో పాటు ప్రత్యేక అష్టమి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్ఛారణలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించి నవ కలశ స్థాపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం దూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. రాత్రి ఉభయ దేవేరులతో శ్రీ ప్రహ్లాదవరదుడు విశేష అలంకరణలో పుష్ప పల్లకీపై కొలువుదీరి తిరువీధిలో విహరించారు. అనంతరం అద్దాల మండపంలో కొలువుంచి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఈ కార్యక్రమాన్ని ముగించారు.

పండగ సందడి

నగరంలో ఎక్కడ చూసినా దసరా పండుగ సందడి కనిపించింది. మార్కెట్లు, షాపింగ్ మాల్స్, పూలబజార్లు కిటకిటలాడాయి. కొత్త బట్టల కొనుగోలుదారులతో వస్త్రదుకాణాలు కిక్కిరిశాయి. ఆదివారానికి తోడు పండుగ నేపథ్యంలో సీ.క్యాంపు, కొత్తపేట, అమీన్ అబ్బాస్‌నగర్ రైతుబజార్లతో పాటు పాతబస్టాండ్, పెద్ద మార్కెట్ ప్రాంతాల్లో రద్దీ రెట్టింపు అయింది. ఆయా ప్రాంతాల్లో పూలు, పండ్లు, మామిడి ఆకులు, కూరగాయలు, పండుగ సరుకుల అమ్మకాలు జోరుగా సాగాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



కొండారెడ్డి బురుజు దగ్గర పూలు కొనుగోలు చేస్తున్న దృశ్యం



రాజ్‌విహార్ సెంటర్‌లో దుస్తుల విక్రయాలు



కిటకిటలాడుతున్న సీక్యాంపు రైతు బజార్



మామిడాకులు, అరిటాకుల కొనుగోలు దృశ్యం

మహిషాసుర మర్దిని.. అమృత వర్షిణి!



లలితా పీఠంలో అమ్మవారు

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏనిమిదో రోజు ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నగరంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవారిని మహిషాసుర మర్దినిగా అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. గీతామందిరంలో వాసవీ మాతను దుర్గాదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గా మాత విగ్రహాలకు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాతనగరంలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాల వద్ద నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ పరిశీలన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఓటింగ్ పరికరాల పనితీరును పరిశీలించే ఫస్టు లెవల్ చెక్ (ఎఫ్‌ఎల్‌సీ) ప్రక్రియను కలెక్టర్ డాక్టర్ జి.సృజన పరిశీలించారు. ఆదివారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ఆమె కేంద్రంలోకి వెళ్లి బెల్ ఇంజినీర్లు చేపడుతున్న ప్రక్రియను పరిశీలించి నిబంధనలు మేరకు ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియను కొనసాగించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు వచ్చే అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. అంతకముందు ఆమె ఎఫ్‌ఎల్‌సీ సూపర్‌వైజర్, డీపీఓ నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు సిటీ: నగరంలోని బీక్యాంపు ప్రభుత్వ బాలురు ఉన్నత పాఠశాలలో 1988 నుంచి 1993 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ స్కూల్ ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా నాటి అనుభూతులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. అప్పట్లో వారికి చదువులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ పూర్వ విద్యార్థులు, పలువురు టీచర్లు పాల్గొన్నారు.

అశ్వక్ ఉల్లాఖాన్‌కు నివాళి

కర్నూలు(సెంట్రల్) : అతి చిన్న వయస్సులోనే కర్నూలుకు చెందిన అశ్వక్‌ఉల్లాఖాన్ దేశం కోసం ప్రాణాలు అర్పించారని అవాజ్ కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, మహ్మద్ షరీఫ్ పేర్కొన్నారు. ఆదివారం అశ్వక్ ఉల్లాఖాన్ 123వ జయంతిని పురస్కరించుకొని కమిటీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ..1900సంవత్సరంలో జన్మించిన ఉల్లాఖాన్‌ను 1927లో బ్రిటీషు వారు ఉరితీశారన్నారు. ఆయన చరిత్రను భావి తరాలు తెలుసుకునేలా చేయాలన్నదే అవాజ్ కమిటీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు నాసిర్, అబ్దుల్ నయిమ్, ఇలియాస్ బాషా, షేక్ ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వేళ స్పందించిన మేయర్

కర్నూలు (టౌన్) : గూడూరు మండలానికి చెందిన 3 సంవత్సరాల పాప స్థానిక నరసింగరావు పేటలోని బాలాజీ హస్పిటల్‌లో చికిత్స చేయించుకుంటుంది. హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటంతో వెంటనే రక్తం అవసరమైంది. దీంతో తల్లిదండ్రులు ఆదివారం నగర మేయర్ బీవై రామయ్యకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వెంటనే ఆయన తన వద్ద పనిచేసే గన్‌మెన్ పి.సలీమ్‌ను పంపించి రక్తం ఇప్పించారు. సమయానికి స్పందించిన మేయర్, సలీమ్‌ను చిన్నారి కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖోలో కర్నూలుకు మూడో స్థానం

కర్నూలు (టౌన్): ఈనెల 21న చిత్తూరు జిల్లా యాదుమర్రిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖో–ఖో పోటీల్లో కర్నూలు జట్టు మూడో స్థానంలో నిలిచింది. కర్నూలు, ప్రకాశం జట్ల మధ్య జరిగిన ఈ పోటీల్లో ప్రకాశం జట్టు రన్నర్‌గా నిలిచింది. మూడవ స్థానంలో నిలిచిన జట్టును ఖో–ఖో అసోసియేషన్ చైర్మన్ పుల్యాల నాగిరెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఖో–ఖో సంఘం నాయకులు ప్రభాకర్, ఖలీల్ అహమ్మద్, శంకర్, పితాంబర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు టికెట్లపై 10శాతం రాయితీ

కర్నూలు(రాజ్‌విహార్): రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో పోను, రాను టికెట్ ఒకే సారి రిజర్వేషన్ చేసుకుంటే 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కర్నూలు–2 డిపో మేనేజర్ సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రెండు టికెట్లు ఒకే సారి తీసుకుంటే తిరుగు ప్రయాణానికి మాత్రమే రాయితీ వర్తించేదని, ఇప్పుడు ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు రెండు వైపులా ఈ సౌకర్యం కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ సదపాయం ఏసీ, నాన్ ఏసీ బస్సుల్లో అందుబాటులో ఉందన్నారు.

అంత్యక్రియలకు వెళ్లి.. చెరువులో శవమై తేలి

వెల్దుర్తి: మూడు రోజుల క్రితం రత్నపల్లె గ్రామంలో బంధువు అంత్యక్రియలకు వెళ్లిన అదే గ్రామానికి చెందిన బోయ రంగడు (35) చెరువులో ఆదివారం శవమై తేలాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 18న రత్నపల్లెలో తన బంధువైన రామకృష్ణ మృతిచెందగా బోయ రంగడు అతని అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం బంధువర్గంతో కలిసి గ్రామం ఆనుకునే ఉన్న చెరువులో స్నానానికి వెళ్లాడు. బంధువులందరూ ఇళ్లకు వచ్చినా బోయరంగడు రాలేదు. ముగ్గురు పిల్లలతో కలిసి అతని భార్య వెంకటేశ్వరమ్మ తన పుట్టినిల్లు గోవర్ధనగిరిలో ఉంటోంది. దీంతో అతను రత్నపల్లెలోని ఇంటికి రాకపోవడంపై ఎవరికీ అనుమానాలు రాలేదు. ఆదివారం తెల్లవారుజామున చెరువులో శవమై తేలిన బోయరంగడును గుర్తించిన స్థానికులు పోలీసులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది సంఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీశారు. తన భర్త బోయ రంగడు ప్రమాదవశాత్తూ చెరువులో పడిపోయి ఉంటాడని వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.































శుభమస్తు... విజయోస్తు!

- నేడు 'విజయ దశమి'
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శమీ వృక్ష పూజకు ఏర్పాట్లు



కందేరిలో కొలువు దీరిన దుర్గమ్మ

కర్నూలు కల్చరల్: ఆశ్వయుజ శుద్ధ దశమి రోజును విజయ దశమిగా పిలుస్తారు. ఆ రోజు సాయం కాలం ఎవరు శక్తి స్వరూపిణిని ఆరాధిస్తారో వారు చేపట్టే కార్యాల్లో తప్పక విజయం చేకూరుతుందని పండితుల అభిప్రాయం. ఈ పండుగ రోజు చేసే మరో విశేషమైన కార్యం శమీ వృక్షాన్ని పూజించడం. శమీ వృక్షం అంటే జమ్మిచెట్టు. శమి అంటే శత్రువుల్ని, పాపాల్ని నశింప చేసేది అని అర్థం. దశమి రోజు సాయంత్రం శమీ వృక్షం / సమిధకు ప్రదక్షిణ చేస్తే నవరాత్రుల పూజల్లో ఏవైనా తెలియక చే సే దోషాలు, తప్పులు ఉంటే పోతాయంటారు. ఉమ్మడి జిల్లాలో దసరా వేడుకలు పెద్ద ఎత్తున జరుగుతాయి. కర్నూలు నగరం, నంద్యాలతో పాటు, శ్రీశైలం, మహానంది, ఆదోని, నందవరం, డోన్, నందికొట్కూరు, ఆత్మకూరు, పత్తికొండ, కల్లూరు, తదితర ప్రాంత్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కర్నూలు పాత నగరంలోని జమ్మిచెట్టు, జిల్లా గో రక్షణశాల, బుధవారపేట త్రీటౌన్ పోలీస్ స్టేషన్ సమీపం, సీక్యాంప్‌లోని టీటీడీ కల్యాణ మండపం ఆవరణ, మెడికల్ కాలేజ్ మైదానం, అశోక్‌నగర్ ఈశ్వర ఆజంనేయ స్వామి ఆలయం, పాతనగరం నగరేశ్వరస్వామి ఆలయం, సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయం, పాత కల్లూరులో శమీ వృక్ష పూజలు ప్రత్యేకంగా నిర్వహిస్తారు.

25న దుర్గా విగ్రహాల నిమజ్జనం

కర్నూలు కల్చరల్: దుర్గా మాత విగ్రహాల నిమజ్జనాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నట్లు మాజీ రాజ్య సభ సభ్యులు, బీజేపీ నేత టీజీ వెంకటేష్ పేర్కొన్నారు. ఆదివారం దుర్గా విగ్రహాల నిమజ్జన ప్రాంతం తుంగ భద్ర నది దుర్గా ఘాట్‌ను ఆయన సందర్శించారు. నిమజ్జనానికి సంబంధించిన ఏర్పాట్లపై నిమజ్జన కమిటీ సభ్యులతో చర్చించారు. కమిటీ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, దాశెట్టి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ పక్షుల సందర్శనశాల ప్రారంభం



పక్షుల సందర్శన శాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): నగరంలోని ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ పక్షుల సందర్శన శాలను ఆదివారం సాయంత్రం కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ సంప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఎగ్జిబిషన్ నగర ప్రజలను అకట్టుకుంటుందన్నారు. నిర్వాహకులు చక్కని పక్షుల ఆకారాలు, ఆకృతులను ఏర్పాటు చేశారన్నారు. నిజమైన పక్షులను తలపించే విధంగా అనుభూతి కలుగుతుందన్నారు. గతంలో ఎన్నడు ఇలాంటి ప్రదర్శన శాల చూడలేదన్నారు. పెద్దలకు జైంట్ వీల్, రైల్, జంపింగ్ డాల్ తదితర ఆట వస్తువులు ఏర్పాటు చేశారన్నారు.దీనిని నగర ప్రజలు వినియోగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారయణమ్మ, స్థానిక కార్పొరేటర్ విజయలక్ష్మి, ఎగ్జిబిషన్ నిర్వాహకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించి సహకరించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారి విద్యుత్ బిల్లులు చెల్లించి సంస్థకు సహకరించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వై. సుబ్బన్న ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బిల్లుల జారీ ప్రక్రియ ఈ నెల 9వ తేదీలోపు ముగిసిందని, బిల్లులు ఇచ్చినప్పటి నుంచి 15 రోజులు గడువు ఇచ్చినట్లు పేర్కొన్నారు.





బలిజ, కాపు భవన నిర్మాణం పూర్తి చేయండి

కర్నూలు (టౌన్) : బలిజ, కాపు భవన నిర్మాణాలు పూర్తి చేయాలని బలిజ సంఘీయులు మేయర్ రామయ్య, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌ను కలిసి విన్నవించారు.













30న సీపీఎం బహిరంగ సభ

కర్నూలు(సెంట్రల్): ఆదోనిలో అక్టోబర్ 30వ తేదీన సీపీఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకరరెడ్డి తెలిపారు. ఆదివారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం పోరాటాలకు సిద్ధమవుతోందన్నారు.

డాక్యుమెంట్ పోయినది

వీరంరెడ్డి ప్రతాప్‌రెడ్డి తండ్రి వి.వెంకటరామిరెడ్డి ఇ.నెం.1-18సి౩. నాగలాపురం (గ్రామం) గూడూరు (మం) కర్నూలు (జిల్లా) ఈయనకు సంబంధించిన ఒరిజినల్ డాక్యుమెంట్స్ నెం. 3817/2022, 2311/2000 (సర్వే నెం:171/3) పార్ట్ బి.తాంద్రపాడు గ్రామం ప్లాట్ నెం.38ఎ మా ఇంటి నుండి పెద్దపాడు వెళుతుంటే పోయినవి. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబర్‌ను సంప్రదించగలరు.

సెల్ : 9703060359













